క్లుప్తంగా

శత చండీయాగం పూర్తి



పూజలో పాల్గొన్న మల్లు నందిని

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ సుందర్ టాకీస్‌రోడ్ అయోధ్య రామరాజ్యం స్థలంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శత చండీ యాగం బుధవారం పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాలతో ముగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వేంరెడ్డి శ్రీనివాసరెడ్డి, దొబ్బల సౌజన్య, నిర్వాహకులు సునీత, కటకం గిరిప్రసాద్, సుధారాణి, కటకం ఉమా, శ్రీలక్ష్మి, లక్ష్మణ్‌రావు, చిన్ని, ప్రతిభరెడ్డి, రాము, రాంబాబు, ప్రదీప్, వాణి, శ్రావణి, ఉష, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బోరు ప్రారంభం

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరు గ్రామంలో తాగునీటి సౌకర్యార్థం బోరును ఏర్పాటు చేశారు. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గ్రామానికి వచ్చిన సందర్భంగా మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, మాజీ ఎంపీటీసీ వెన్నపూసల సీతారాములు సమస్యను వివరించగా.. మంత్రి స్పందించి రూ.3.50 లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో బోరు, పైపులైన్, విద్యుత్ సౌకర్యం కల్పించగా.. బుధవారం బోరును ప్రారంభించారు. ఈమేరకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

నూతన ఎక్సైజ్ భవనంలో లోపాలపై నివేదిక

నేలకొండపల్లి: నేలకొండపల్లిలో నిర్మించిన ఎక్సైజ్ భవనంలో లోపాలపై జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు నివేదిక ఇచ్చినట్లు సీఐ కె.జగన్నాథరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేకపోగా, పై ఫ్లోర్ పూర్తిగా అసంపూర్తిగాఉందని చెప్పారు. ఈమేరకు అన్ని సౌకర్యాలు కల్పించాకే స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. కాగా, నేలకొండపల్లి ఎక్సైజ్ సర్కిల్‌ను గుడుంబా రహితంగా తీర్చిదిద్దేందుకు విస్తృత తనిఖీలు చేపడుతూ ఇప్పటివరకు 38 మందిపై బైండోవర్‌పై కేసులు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

హామీలు అమలు చేయాలి

తిరుమలాయపాలెం: గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు తిమ్మిడి హనుమంతరావు అన్నారు. బుధవారం మండలంలోని బచ్చోడులో ఆ పార్టీ మండల నాయకుడు ఎన్నబోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో గోడ పత్రికలు ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ బచ్చోడు గ్రామ కార్యదర్శి వెన్నబోయిన శ్రీనివాసరావు, గొర్రెపాటి శ్రీను, జనక భద్రమ్మ, గొర్రెపాటి భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' బిల్లులు చెల్లించాలి

ఖమ్మంరూరల్: ఉపాధి కూలీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు పి.సంగయ్య అన్నారు. బుధవారం వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే ఊరుకోమని, కేంద్ర బడ్జెట్ కేవలం కార్పొరేట్ శక్తులకు ఉపయోగపడేలా ఉందన్నారు. సంఘం నాయకులు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, బుద్ధి ప్రసాద్, వి.నాగేశ్వరరావు, ఎస్.కృష్ణ, ఉపేందర్, కర్లపూడి వెంకటేశ్వర్లు, పగిడిపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల తీరు మారాలి

నేలకొండపల్లి: గిరిజనులను ఎక్సైజ్ అధికారులు అలుసుగా చూస్తున్నారని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం ఆరోపించారు. కూసుమంచి మండలంలోని లోక్యాతండాకు చెందిన వడ్తియా రవి అనే బెల్ట్‌షాపు నిర్వాహకుడు వద్ద నుంచి బుధవారం ఎక్సైజ్ అధికారులు మద్యం పట్టుకొచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్టేషన్‌లో ఉంచడంతో గిరిజన సంఘం ప్రతినిధులు సీఐతో మాట్లాడేందుకు ప్రయత్నించినా ఆయన స్పందించలేదు. దీంతో సీఐ చాంబర్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తప్పు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి, కానీ ఉదయం నుంచి రాత్రి వరకు స్టేషన్‌లో ఉంచడం ఏంటని ప్రశ్నించారు. ఎక్సైజ్ అధికారులు స్టేషన్‌కు వచ్చేంత వరకు నిరసన కొనసాగిస్తామన్నారు. సంఘం పాలేరు డివిజన్ కార్యదర్శి భూక్యా కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, బయట సరుకు తీసుకొచ్చినందుకు కేసు నమోదు చేసినట్లు సీఐ జగన్నాథరావును తెలిపారు.

వానరానికి అంత్యక్రియలు

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో బుధవారం ఓ వానరం చనిపోయింది. దీంతో కోదాడలో ఉంటున్న షేక్ అబ్బాస్ అలీ, బీయమ్మ, యాకోబీలతో పాటు వారి కుటుంబ సభ్యులకు గ్రామస్తులు తెలపడంతో వారు ఇక్కడకు వచ్చి వారి సొంత ఖర్చులతో గ్రామంలో ఊరేగించి అంత్యక్రియలు చేపట్టారు.

అతివల అరచేత.. | అందాల అరుణోదయం

స్త్రీ సౌభాగ్యానికి చిహ్నంగా గోరింటాకు

- పూర్వ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న మహిళలు
- మారుతున్న కాలంతో మెహందీల వైపు మొగ్గు
- చేతులు, కాళ్లపై భిన్నమైన డిజైన్లు
- పలువురు ఉపాధి పొందుతున్న వైనం

తెలుగు లోగిళ్లలో పండుగ అయినా, పబ్బమైనా అమ్మాయిల చేతులు, కాళ్లకు గోరింటాకు తప్పనిసరి. పెళ్లి కాని యువతికి ఇది ఎర్రగా పండితే మంచి భర్త వస్తాడని, గర్భిణుల అరచేతలు ఎర్రగా మారితే కట్టుకున్నవాడికి చాలా ప్రేమ ఉన్నట్లు అని చమత్కరిస్తారు. ఆడపడుచులంతా ఒకేచోట చేరి సంబరంగా గోరింటాకు నూరి చేతుల నిండా పెట్టుకుంటూ, కబుర్లు చెబుతూ తెగ సందడి చేస్తారు. ఆషాఢ మాసంలో దీన్ని పెట్టుకుంటే రుతువు మారిన వేళ కాళ్లు, చేతులు, గోళ్లు శుభ్రపడతాయని, రోగ నిరోధకంగా పనిచేయడంతో పాటు అంటు వ్యాధులను కూడా దూరం చేస్తాయని వైద్యులు సైతం చెబుతున్నారు.

– ఖమ్మంగాంధీచౌక్



ఓ పాఠశాలలో గోరింటాకు పండుగ(ఫైల్)



గోరింటాకు పండిన తర్వాత..



చేతులపై మెహందీతో..

స్త్రీ సౌభాగ్యానికి చిహ్నంగా..

హిందూ, ముస్లిం తేడా లేకుండా మగువలు ఇంటింటా గోరింటాకు సందడి చేస్తారు. అయితే దీని అసలు పేరు గౌరింటాకు(గౌరి ఇంటి ఆకు). గౌరీ దేవి రజస్వల సమయంలో పుట్టిన మొక్క నుంచి ఆకులను కోస్తుండగా.. గౌరి చేతులు ఎర్రబడతాయి. దీన్ని చూసిన పర్వతరాజు స్త్రీ సౌభాగ్యానికి చిహ్నంగా అభివర్ణిస్తాడు. అప్పటి నుంచి దీనికి ఆదరణ పెరుగుతూ వస్తోంది.

ప్రయోజనాలిలా..

గోరింటాకు శరీరంలో అతి ఉష్ణాన్ని, స్త్రీల గర్భాశయ దోశాలను తొలగిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ప్రసవం కాగానే ముద్దగా నూరి దీన్ని బాలింతకు మింగిస్తే గర్భాశయ బాధలు తగ్గిపోతాయని నమ్మకం ఉంది. అంతేకాక ఇది పండే విధానం..ఆరోగ్యానికి ఓ సూచికగా కూడా పూర్వీకులు చెబుతున్నారు. ఆషాఢ మాసంలో మహిళలు పుట్టింటికి వెళ్లినప్పుడు పెట్టుకుంటే పార్వతీదేవి వద్దకు వెళ్లినట్లు చరిత్ర చెబుతుంది.

మెహందీలకు మొగ్గు..

గోరింటాకుతో ముడిపడింది మెహందీ. సూర్యుడికి ప్రతీకగా ఈ అలంకరణ సూచిస్తుంది. భరత నాట్యం వంటి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో దీనికి గొప్ప ప్రాముఖ్యత ఉంది. కొందరు కేన్సర్ రోగులు, అలోపేసియాతో బాధపడుతున్న మహిళలు తలకు కూడా రాసుకుంటారు. అన్ని మతాలు, కులాల వారు ఈ మోహందీని పండుగలు, శుభ కార్యాల్లో పెట్టుకొని అలంకరించుకుంటారు.

పలువురికి ఉపాధి..

మెహందీలను చేతులు, కాళ్లకు పెట్టడంలో రాజస్తానీలు దిట్ట. కొందరు మెహందీని వృత్తిగా ఎంచుకొని నగరంలోని కమాన్‌బజార్, కస్బా బజార్, వైరారోడ్, గాంధీచౌక్ తదితర ప్రాంతాలు, వస్త్ర దుకాణాల వద్ద, ఫ్యాన్సీ దుకాణాలను తమ అడ్డాలుగా మార్చుకొని ఉపాధి పొందుతున్నారు. తాము రూపొందించుకున్న ఆల్బమ్‌లను చూపిస్తూ.. డిజైన్‌ను బట్టి రూ.50లు మొదలు, రూ.500ల వరకు తీసుకుంటారు. గ్రామాల్లో గోరింటాకు ఎక్కువగా ప్రాధాన్యం ఉండగా, పట్టణాలు, నగరాల్లో మెహందీని ఆదరిస్తున్నారు. ఖమ్మం నగరంలోని ప్రధాన కూడళ్లలో వీటిని విక్రయిస్తున్నారు.

గోరింటాకు ప్రయోజకరం..



ఆషాఢ మాసంలో ఏటా గోరింటాకు పెట్టుకుంటాం. ఎంతో అనేక ప్రయోజనాలతో పాటు ఆకర్షణీయంగా ఉంటుంది. శుభకార్యాల సమయంలో అలంకరణలో భాగంగా మెహందీలు పెట్టుకుంటున్నారు. ఇష్టమైన డిజైన్లను చేతులు, కాళ్లకు పెట్టించుకుంటాం. ఇది ఆరోగ్యానికి మంచిది.

– అనంతలక్ష్మి, మామిళ్లగూడెం

అలంకరణకు సూచిక..



మహిళల అలంకరణలో ఎంత ఆకర్షణీయమైన వస్త్రాలు ధరించినా చేతులు, కాళ్ల అలంకరణలతోనే మగువకు అందం వస్తుంది. గోరింటాకు, మెహందీల అలంకరణలు ఎంతో ఆనందాన్నిస్తాయి. ఆషాఢ మాసంలో, శుభకార్యాల్లో వీటిని ఎక్కువగా పెట్టుకుంటాం.

– సబియా అఫ్రిన్, వ్యవసాయ శాఖ ఉద్యోగి, ఖమ్మం

కొనసాగుతున్న కేంద్ర బృందం పర్యటన

నేలకొండపల్లి: కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం మండలంలోని నాచేపల్లిలో చేపట్టిన అధ్యయనం బుధవారం మూడో రోజుకు చేరింది. ఈసందర్భంగా పీఏసీఎస్‌లో రైతులతో మాట్లాడి సాగు వివరాలు, పెట్టుబడులపై ఆరా తీశారు. ఆతర్వాత స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమై రుణాలతో చేస్తున్న వ్యాపారాల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ బృందంలో మోహన్‌భారతి, అభిషేక్ దేశ్‌వాల్, ఆర్యమ యుగంనకర్, రమణదీప్ ఉండగా, ఎంపీడీఓ ఎం.ఎర్రయ్య, ఏడీఏ విజయచంద్ర, ఈజీఎస్ ఏపీఓ సునీత, ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి, పంచాయతీ కార్యదర్శులు పి.బాబురావు, ఇబ్రహీం పాల్గొన్నారు.



సొసైటీలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

నూతన కార్యవర్గం ఎన్నిక

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ స్టేట్ ఫెడరేషన్ ఫర్ ది డెఫ్ జిల్లా కార్యవర్గాన్ని నగరంలోని వీడీఓస్ కాలనీలో గల టీఎన్‌జీఓ కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఐదేళ్లపాటు కార్యవర్గం పనిచేయనుండగా.. జిల్లా అధ్యక్షుడిగా కె.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఎస్.మురళీకృష్ణ, ఎం.సూర్యప్రకాష్, జనరల్ సెక్రటరీగా ఆర్.వీరయ్య, జాయింట్ సెక్రటరీగా ఎస్‌డీ.మల్లిక్, శ్రీలత, ట్రెజరర్‌గా కె.హనుమంతరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.స్వాతి, అసిస్టెంట్ సెక్రటరీగా పి.ఉదయ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

నియామకం

ఖమ్మం మామిళ్లగూడెం: సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా కమిటీని ఖమ్మంలో ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా సాధినేని జనార్దన్‌రావు, ఉపాధ్యక్షులుగా సుబ్బయ్య, సూర్యప్రకాశరావు, నరసయ్య, శ్రీహరి, కోశాధికారిగా కొత్తసత్యనారాయణరెడ్డి, కార్యదర్శులుగా గుడ్ల వీరభద్రం, ఉపేందర్‌రెడ్డి, అనాసి రాధాకృష్ణ, జిల్లా వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా ఆకుల లక్ష్మీనారాయణ, డి.శ్రీనివాసరావు, గజేంద్రుల నాగేశ్వరరావు, టి.జనార్దన్‌రావు, జగన్ మోహన్‌రావు, తాతా రాఘవయ్యతో పాటు ఏడుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



వెలిగేటి చంద్రమోహన్

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సరళ

ఖమ్మంరూరల్: రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు బి.సరళ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అసలే పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఓ వైపు, ప్రకృతి ప్రకోపంతో మరో వైపు ఏటా రైతులు అప్పుల పాలవుతున్నారని, రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేసి వారిని రుణ విముక్తులను చేయాలని పేర్కొన్నారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద రైతుల పొలాల్లో నీటి కుంటలు తవ్వించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు నంద్ర ప్రసాద్, ఎస్.కృష్ణ, వి.నాగేశ్వరరావు, ఎ.ప్రసాద్ పి.వెంకటరమణ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయాలతో విస్తృత సేవలు

కూసుమంచి: తపాలా కార్యాలయాల ద్వారా ప్రజలకు విస్తృత సేవలు అందిస్తున్నట్లు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని జక్కేపల్లిలో భారత ప్రభుత్వ తపాలా శాఖ ఖమ్మంకు చెందిన పోస్టల్ అధికారులు డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా జనరల్ ఇన్సూరెన్స్ రూ. 10లక్షలు, రూ.15 లక్షలు వరకు పొందొచ్చని తెలుపుతూ.. పోస్టల్ శాఖ ద్వారా అందించే పథకాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్‌ల పంపిణీ

ఖమ్మంరూరల్: మండలంలోని దివ్యాంగులకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 50 శాతం రాయితీతో ఐకేపీ ఏపీఎం బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం డిపో మేనేజర్ దినేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. కాగా, ఎంవెంకటాయపాలెంలో నేడు(గురువారం) దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ చేయనున్నామని, దీనికి సదరమ్ సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్‌లు, ఒక ఫోటో, రూ.50 తీసుకుని గ్రామపంచాయతీ కార్యాలయానికి ఉదయం 10 గంటలకు రావాలని తెలిపారు.

ఎంఈఓల బదిలీలు..

రఘునాథపాలెం: రఘునాథపాలెం ఎంఈఓగా పని చేస్తున్న ఎం.శ్రీనివాస్‌ను ఖమ్మం రూరల్‌కు, సత్తుపల్లి ఎంఈఓ బి.రాములును రఘునాథపాలెం రెగ్యులర్ ఎంఈఓలుగా బదిలీలు చేస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీరు నేడు(గురువారం) బాధ్యతలు స్వీకరించనున్నారు.

మళ్లీ ఎప్పుడొస్తారు సార్..



ప్రభాకర్‌రెడ్డిని చుట్టుముట్టిన విద్యార్థులు

కామేపల్లి: మండలంలోని ముచ్చర్ల–జాస్తిపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వెంకట్ ఆధ్వర్యాన బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈనేపథ్యాన తిరుమలాయపాలెంకు బదిలీపై వెళ్లిన సైన్స్ ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డిను సన్మానించాక.. విద్యార్థులు చుట్టుముట్టి మళ్లీ ఎప్పుడొస్తార్ సార్ అంటూ అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఉపాధ్యాయుడు కూడా కన్నీటి పర్యంతమయ్యాడు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించి అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

నగరంలో మేయర్ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 49, 50 డివిజన్లలో మేయర్ పునుకొల్లు నీరజ బుధవారం పర్యటించారు. ఆయా డివిజన్లలోని మామిళ్లగూడెం, రాపర్తినగర్ ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక సమస్యలను తెలుసుకుని, ప్రకృతి వనాలు, పారిశుద్ధ్యం, డ్రెయినేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. డివిజన్లలో అవసరమైన ప్రాంతాల్లో నూతన డ్రెయినేజీలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయిస్తామన్నారు. బైపాస్ రోడ్డులోని పెద్ద మురికి కాల్వను గ్యాంగ్‌వర్క్‌తో శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్, ఏఎంసీ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

57వ డివిజన్‌లో పారిశుద్ధ్య పనులు..

నగరంలోని 57వ డివిజన్‌లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యల పరిష్కారం కోసం స్థానిక కార్పొరేటర్ ఎండీ.రఫీదా బేగం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ ముస్తఫా ఆధ్వర్యాన పారిశుద్ధ్య పనులను బుధవారం ప్రారంభించారు. ఖాళీ స్థలాల్లో ముంగు, చెత్తను తొలగించడంతో పాటు డ్రెయినేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తీయించారు.



మామిళ్లగూడెంలో రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న మేయర్ నీరజ, తదితరులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

తిరుమలాయపాలెం/ఖమ్మంమామిళ్లగూడెం: తిరుమలాయపాలెం మండలంలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను కాపాడాలని కోరుతూ అఖిల పక్షాల ఆధ్వర్యాన బుధవారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు అని బోర్డు పెట్టినప్పటికీ వాటి హద్దులు చెరిపి ఆక్రమణలకు పాల్పడుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. త్వరలో నిర్మించబోయే ఐటీఐ కళాశాల నిర్మాణానికి మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములను ఉపయోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, బీఆర్‌ఎస్ నాయకులు గంటా కృష్ణ,వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ నాయకులు చింతిరాల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర మైనార్టీ నాయకురాలు, దూదేకుల సంఘం జాతీయ ఇన్‌చార్జ్ షేక్ షకీనా ఆధ్వర్యాన వైరా మండలం రెబ్బవరం గ్రామంలోని ముస్లిం మైనార్టీ ఖబర్‌స్థాన్ సమస్యపై జేసీకి వినతిపత్రం అందజేశారు. వినతి అందించిన వారిలో దూదేకుల సంఘ జిల్లా నాయకులు షేక్ ఖాసీం, షేక్ ఇమాంసాహెబ్, మజీద్ సదర్ లాల్‌పాష తదితరులు పాల్గొన్నారు.



తిరుమలాయపాలెం: మధుసూదన్‌నాయక్‌కు వినతి పత్రం ఇస్తున్న అఖిలపక్షం నాయకులు

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఖమ్మంరూరల్/రఘునాథపాలెం/ఖమ్మంవ్యవసాయం: మండలాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, లైన్‌లలో చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా నేడు(గురువారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈలు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు ఖమ్మంరూరల్ మండలంలోని పెదతండా ఎస్‌ఎస్ 11కేవీ ఫీడర్‌లో ఏదులాపురం, పెదతండా గ్రామ పంచాయలకు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ క్రాంతిసింహ తెలిపారు. అలాగే, రఘునాథపాలెం పారిశ్రామిక ఫీడర్ 11 కేవీ లైన్ పరిధిలోని కేటీఆర్ కాలనీ, కేసీఆర్ కాలనీ, గ్రీన్ కాలనీ, పువ్వాడనగర్, పాత పోలీస్ స్టేషన్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని రఘునాథపాలెం ఏఈ ఇందిరా తెలిపారు. అదేవిధంగా ఖమ్మం నగరంలోని దానవాయిగూడెం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న సారధినగర్, వాటర్ వర్క్స్, రాజీవ్ గృహకల్ప 11 కేవీ పరిధిలో ఉదయం 9 నుంచి మధాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–1 ఏఈ ఎం.మౌలిక తెలిపారు. దీంతో సారధినగర్ వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, జూబ్లీ స్కూల్ ఏరియా, జూబ్లీ క్లబ్ రోడ్, ఫిష్ హౌస్ లైన్, బైపాస్ రోడ్, వాటర్ వర్క్స్, గణేష్ నగర్ బోర్డు, మేకల నారాయణ బోర్డు, కామంచికల్, దారేడు లైన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. నగరంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ సహకారనగర్ లైన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–3 ఏఈ బి.తావుర్యా తెలిపారు. దీంతో సహకారనగర్, బోడేపూడి స్థూపం, వీడీఓస్ కాలనీ, గట్టయ్యసెంటర్, మున్సిపాలిటీ ఆఫీస్ ఏరియా, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రాంతం, కృషి భవన్ రోడ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఏఈలు కోరారు.

సన్మానాలు..

సూపరింటెండెంట్‌కు..



మిషక్‌ను సన్మానిస్తున్న ఎస్సీడీడీ సత్యనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని ఎస్సీ డీడీ బాలుర ఆనంద నిలయం సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన మారేల్లి మిషక్‌ను బుధవారం ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ సత్కరించారు. ఎస్సీ డీడీ కార్యాలయంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో పెన్షన్‌కు సంబంధించిన ఉత్తర్వులను మిషక్‌కు అందజేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్లు ఎండీ.రహీమోద్దిన్, రవి, ఎస్సీ కార్పొరేషన్ ఈఓ ఉపేంద్ర, ఇన్‌చార్జ్ ఏఎస్సీడీఓ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు..

కామేపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ పీఏఎస్ఎన్ గుప్తా, టైపిస్ట్ ఏవీఎస్ చారి, ఊట్కూర్ కార్యదర్శి రవిలు బదిలీపై వెళ్తుండగా బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సన్మానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా శాలువా కప్పి సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, ఏపీఓ శ్రీరాణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(1104) ప్రాంతీయ డిస్కమ్ కార్యదర్శికి..

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(1104) ప్రాంతీయ డిస్కమ్ కార్యదర్శి తక్కెళ్లపల్లి శేషగిరిరావు ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఖమ్మంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం సర్కిల్ ఎస్ఈ ఎ.సురేందర్, డీఈటీ బాబూరావు, అధికారులు సీహెచ్.నాగేశ్వరరావు, శ్రీధర్, యూనియన్ ప్రతినిధులు జీఎల్ఎన్‌రావు, సురేష్, రమేష్, వెంకటేశ్వరరావు, కిరణచారి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొని సత్కరించారు. అనంతరం శేషగిరిరావు విద్యుత్ శాఖలో 33 ఏళ్లపాటు సేవలందించారని అధికారులు కొనియాడారు.

వైద్య శిబిరం విజయవంతం

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి గీత, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ సంబరాలు...

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దశల వారీగా అర్హులైన రైతులకు రుణమాఫీ చేసిన సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రైతులను రుణ విముక్తులను చేస్తున్నందుకు రుణపడి ఉంటామని పలువురు పేర్కొన్నారు. – రఘునాథపాలెం



పత్తి చేనులో పాలాభిషేకం చేస్తున్న నాయకులు

1,230 మంది రైతులకు రూ.5.89 కోట్ల రుణమాఫీ

నేలకొండపల్లి: ప్రభుత్వం ప్రకటించిన రెండో విడత రుణమాఫీ డీసీసీబీ నేలకొండపల్లి బ్రాంచ్ పరిధిలో 1,230 మంది రైతులకు వర్తించింది. ఈమేరకు బ్రాంచ్ మేనేజర్ టి.ఇందు వివరాలు వెల్లడించారు. బ్రాంచ్ పరిధిలో తొమ్మిది సొసైటీలు, బ్యాంకు బ్రాంచ్ ద్వారా రూ.1.50లక్షల వరకు రుణాలు ఉన్న 1,230 మంది రైతులకు రూ.5,89,22,570 కోట్లు మాఫీ అయిందని తెలిపారు. ఆయా రైతులు తిరిగి రుణాలు పొందేందుకు అవసరమైన పత్రాలు సమర్పించాలని సూచించారు. కాగా, నేలకొండపల్లి సొసైటీ పరిధిలో అత్యధికంగా 264 మంది రైతులకు రూ.81,94,412 రుణమాఫీ వర్తించగా.. డీసీసీబీ బ్రాంచ్‌లో ఇద్దరికి రూ.2,33,412 రుణమాఫీ అయిందని మేనేజర్ తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్

కొత్త బస్టాండ్‌లో అపరిశుభ్రత..!



కోట్ల రూపాయలతో నిర్మించిన ఖమ్మం కొత్త బస్టాండ్‌లో స్టేషన్ మేనేజర్ పర్యవేక్షణ లోపించడంతో అపరిశుభ్రత నెలకొంది. బస్టాండ్‌లో క్యాంటీన్ నిర్వాహకులు మరమ్మతుల కోసం గ్రానైట్ బండలు, ఇసుక తీసుకొచ్చి ప్రయాణికులు నడిచే మార్గంలో, ఏటీఎంల పక్కన ఇదిగో ఇలా ఉంచడంతో ఇబ్బందికరంగా ఉంది. గ్రానైట్ బండలను అక్కడే కట్ చేయడంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది. వారం రోజులు దాటినా.. వాటిని అక్కడ నుంచి తొలగించడం లేదు. దీంతో క్యాంటీన్ నిర్వాహకుల నిర్లక్ష్యం, స్టేషన్ మేనేజర్ తనకు పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరుపై ప్రయాణికులు పలు విమర్శలు చేస్తున్నారు.

– ఖమ్మం మయూరిసెంటర్